సాక్షి మహబూబ్‌నగర్

బుధవారం । 19 । జూన్ । 2024



నలుగురికి ప్రాణదీపమై..

పుట్టెడు దుఃఖంలోనూ కుమారుడి అవయవాలు దానం చేసి ఆదర్శంగా నిలిచారు.

వివరాలు 8లో ▸



జాతీయ హోదా తేవాలి

'పాలమూరు' ప్రాజెక్టుకు జాతీయ హోదా తేవాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.4 /24.1

వాతావరణం

ఆకాశం ఆహ్లాదంగా ఉంటుంది. అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. సాయంత్రం చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సివిల్ సర్వీస్‌లో ఉచిత లాంగ్‌టర్మ్ శిక్షణ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీస్–2025లో పరీక్ష రాసే అభ్యర్థుల కోసం ఉచిత లాంగ్ టర్మ్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలంగాణ బీసీ సంక్షేమాధికారి ఇందిర, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ స్వప్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. డిగ్రీ పాసైన అభ్యర్థులు ఈ నెల నుంచి తమ పేర్లను www.tgbcstudycircle.cgg.gov.in సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం ఫోన్ నం.08542–293790ను సంప్రదించాలని కోరారు.

గ్రూప్–2 అభ్యర్థులకు గ్రాండ్ టెస్ట్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్–2 అభ్యర్థులకు గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ స్వప్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ పద్ధతిలో జరిగే పరీక్షకు సంబంధించి పూర్తి వివరాలను ఫోన్ నం.08542– 293790ను సంప్రదించాలని కోరారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 19 నుంచి వచ్చే నెల 5 వరకు www.tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని చెప్పారు.

కురుమూర్తిస్వామి హుండీ లెక్కింపు



చిన్నచింతకుంట: అమ్మాపురం సమీపంలో వెలసిన కురుమూర్తిస్వామికి భక్తులు అమావాస్య, శని, సోమవారాలను పురస్కరించుకొని కానుకలుగా సమర్పించిన హుండీని ఆలయ అధికారులు మంగళవారం లెక్కించారు. స్వామివారి హుండీ ఆదాయం రూ.4,66,664 వచ్చిందని ఆలయ ఈఓ మధనేశ్వర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చక సిబ్బంది, వివిధ సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

23న పుస్తకావిష్కరణ సభ

పాలమూరు: పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 23న ఉదయం 10 గంటలకు జిల్లాకేంద్రంలోని ఆల్మాస్ ఫంక్షన్ హాల్‌లో ఖలీల్ రచించిన 'యుద్ధంలో పావురం' పుస్తక ఆవిష్కరణ సభ నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పుస్తకాన్ని ప్రొఫెసర్ హరగోపాల్ ఆవిష్కరిస్తారని, పలువురు వక్తలు హాజరవుతారని వెల్లడించారు. పుస్తక ఆవిష్కరణ సభకు జిల్లాలోని రచయితలు, మేధావులు అధికంగా తరలిరావాలని కోరారు.

ఎన్నికల విధుల్లో మృతులకు ఎక్స్‌గ్రేషియా

సాక్షి, నాగర్‌కర్నూల్: లోక్‌సభ ఎన్నికల నిర్వహణ విధుల్లో భాగంగా మృతిచెందిన అధికారులు, సిబ్బందికి ఎన్నికల సంఘం రూ.15 లక్షల నష్టపరిహారం అందజేస్తున్నట్లు ప్రకటించింది. ఉమ్మడి జిల్లాలోని జోగుళాంబ గద్వాల జిల్లా నీటిపారుదల శాఖలో ఏఈగా పనిచేస్తున్న కె.మదన్‌మోహన్ లోక్‌సభ ఎన్నికల విధులు నిర్వహిస్తూ పోలింగ్ రోజు గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన కుటుంబానికి రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తూ మంగళవారం రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈఓ వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీచేశారు.

మొలకెత్తని ఆశలు

మూసాపేటకు చెందిన రైతు జింకలి వెంకటయ్య ఎకరా పొలంలో పదిరోజుల క్రితం కంది విత్తనాలు నాటాడు. కానీ, అప్పటి నుంచి వర్షాలు కురవకపోవడం విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో మంగళవారం నిర్మాణంలో ఉన్న తన ఇంటి వద్ద సింగిల్ ఫేజ్ మోటార్ ఆన్ చేసి డ్రమ్ములో నీళ్లు పట్టి అక్కడి నుంచి బిందెల ద్వారా విత్తనాల సాళ్లలో నీళ్లు పోయించడం కనిపించింది. ఇదిలా ఉండగా చాలామంది రైతులు విత్తనాలు వేసి వర్షాలు రాకపోవడంతో దిగులు చెందుతున్నారు. వానమ్మా.. రావమ్మా అంటూ దీనంగా ఎదురుచూస్తున్నారు. – అడ్డాకుల



మొదట్లో మురిపించి.. మొహం చాటేసిన వరుణుడు

- నరిపడా పదును లేక భూమిలోనే ఆరుతడి విత్తనాలు
- ఇప్పటికే కరిగిపోయిన జొన్న, మొక్కజొన్న సాగు కాలం
- మృగశిరలోనూ 35 డిగ్రీలు నమోదవుతున్న ఎండలు
- విత్తనం నాటడంతోనే మొదలైన రైతుల కష్టాలు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): తొలకరి కురిసినట్టే కురిసి మళ్లీ కనిపించకుండా పోయింది. వారం రోజులుగా చినుకు జాడే కనిపించడం లేదు. దీంతో పొలంలో విత్తిన పత్తి, కంది ఇతరత్రా ఆరుతడి విత్తనాలు మొలకెత్తక ఆందోళనకు గురిచేస్తోంది. మొదట్లో మురిపించిన వానలు విత్తనం వేయగానే ముఖం చాటేసి రైతులను కంటతడి పెట్టిస్తోంది. జిల్లాలోని దేవరకద్ర, మిడ్జిల్, జడ్చర్ల, నవాబ్‌పేట, మహబూబ్‌నగర్, చిన్నచింతకుంట, మూసాపేట, అడ్డాకుల, భూత్పూర్ ప్రాంతాల్లో ముందస్తుగా వే సిన పంటలు నీరు లేక వాడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతోపాటు ఉష్ణోగ్రతలు 35 నుంచి 37 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. గతేడాది ముందే వర్షాలు కురవడంతో పంటలు వేసిన రైతులు ప్రస్తుతం వర్షాలు కురవకపోవడంతో పంటల సాగుకు వెనకడుగు వేస్తున్నారు. నారుమడులను సిద్ధం చేస్తున్న రైతులు భారీ వర్షాలు పడకపోవడంతో ఆరుతడి పంటలు వేసేందుకు ఆలోచిస్తున్నారు. విత్తనం, ఎరువుల ధరలతోపాటు దున్నుడు ఖర్చులు కూడా పెరగడంతో వర్షాలు పడేంత వరకూ వేచి చూస్తున్నారు.

ముందస్తుగా సిద్ధమైనా..

జిల్లావ్యాప్తంగా రైతులు ముందస్తుగానే వానాకాలం పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు విత్తనాలు, ఎరువులు సైతం కొనుగోలు చేశారు. ఈ క్రమంలోనే రోహిణి కార్తెలో కురిసిన వర్షాలకు జిల్లాలో సుమారు 35,378 ఎకరాల్లో పత్తి విత్తనాలు విత్తినట్లు ప్రాథమిక అంచనా. ఇక వరినాట్ల కోసం నారుమడులను సిద్ధం చేస్తున్నారు. బీపీటీ–5204 (సోనామసూరి) రకం జిల్లాలో ముందుగానే నారుమడులు పోయగా.. ఆర్‌ఎన్‌ఆర్ ఇతర రకాలను రైతులు ప్రస్తుతం నారు పోస్తున్నారు. అయితే ఎండవేడిమి ఎక్కువగా ఉండటంతో నారు మడులు పోసినా సక్రమంగా రావడం లేదు.

■ జిల్లా రైతులు వరితోపాటు వానాకాలంలో ఆరుతడి పంటలైన పత్తి, మొక్కజొన్న, జొన్న, కంది ఎక్కువగా సాగు చేస్తారు. కానీ, ఈపాటికే జొన్న, మొక్కజొన్న పంటల సాగు కాలం వెనక్కిపోయింది. ఇక వర్షాధారంగా పత్తి, కంది, పెసర్లు సాగు చేసుకోవచ్చు. బోర్లు, భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నా విత్తనాలు వేసిన తర్వాత నీళ్లు అందించిన తేమ లేక మొలిచే అవకాశం తక్కువగా ఉండటంతో వెనకడుగు వేస్తున్నారు. పంట వేసిన మొలవకపోతే ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది.

అధికారుల అంచనా ప్రకారం వివరాలిలా..

వానాకాలంలో మొత్తం పంటల సాగు అంచనా	3,21,523 ఎకరాలు
ఇప్పటికే నాటిన పత్తి	35,378 ఎకరాలు
మొక్కజొన్న పంట	3,805 ఎకరాలు
జొన్న పంట	5,308 ఎకరాలు
కంది	2,240 ఎకరాలు
ఇతర విత్తనాలు	4,659 ఎకరాలు



మహమ్మదాబాద్ మండలం చౌదర్‌పల్లిలో వాడుపట్టిన జొన్న పంట

ఆ పంటల కాలం పోయింది..



రోహిణి, మృగశిర కార్తెలు వచ్చినా ఇప్పటి వరకు సరైన వర్షాలు కురవలేదు. రోహిణిలో ఆరుతడి పంటలు వేస్తే మంచి దిగుబడి వస్తాయి. ఇప్పుడు జొన్న, మొక్కజొన్న విత్తనాలు విత్తలేం. ఈపాటికే నెల పంట కాలం పోయింది. నేను ఐదెకరాల్లో జొన్న విత్తనాలు విత్తాను. మరో పదెకరాల్లో వరి సాగు చేయాలనుకున్నా. కాకపోతే వర్షాలు సమృద్ధిగా కురిస్తే గానీ నారుమడులు పోసుకోలేం.

– వెంకటేశ్వర్‌రెడ్డి, రైతు, మాచన్‌పల్లి, మహబూబ్‌నగర్ రూరల్

మొలకలు వాడుతున్నాయి



వర్షం లేక కంది, జొన్న మొలకలు వాడుపడుతున్నాయి. రెండెకరాల్లో పంటలు సాగు చేయగా.. కలుపు వచ్చింది. కలుపు తీయడానికి కూడా పదును అవసరం. రోహిణి కార్తెలో కురిసిన వర్షాలకు నాకున్న రెండెకరాల్లో కంది, జొన్న విత్తనాలు విత్తగా.. మొలకలు వచ్చాయి. ఇప్పుడు వర్షం కురవకపోవడంతో మొలకలు ఎండలకు వాడిపోతున్నాయి.

– కావలి సత్తయ్య, చౌదర్‌పల్లి, మహమ్మదాబాద్ మండలం

ఈ నెలాఖరు వరకు..



వర్షాధార పంటలు వేసుకోవడానికి ఈ నెలాఖరు వరకు సమయం ఉంది. వర్షాలు సమృద్ధిగా కురిసిన తర్వాతే ఆరుతడి పంటలు వేసుకోవాలి. తొందరపడి విత్తనాలు నాటొద్దు. ప్రస్తుతం గాలిలో, భూమిలో తేమ కూడా తక్కువగా ఉంది. రెండు, మూడు రోజుల్లో భారీవర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు అప్పటి వరకు ఆగాలి. ఇది వరకు విత్తిన విత్తనాలకు మొలకలు వచ్చింటే ఆ మొలకలకు పదును ఉన్నప్పుడే ఎరువులు వేయాలి.

– వెంకటేష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

మరో రెండు రోజుల్లో వర్షాలు..?

వ్యవసాయ, వాతావరణ శాఖ సమాచారం బట్టి మరో రెండు, మూడు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. భారీ వర్షాలు పడిన తర్వాతే పంటలు వేస్తే బాగుంటుందని వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. జిల్లాలో కొన్నిచోట్ల రైతులు పత్తి విత్తనాలు విత్తారు. మిగతా రైతులు మాత్రం వెనకడుగు వేస్తున్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



కలెక్టర్‌కు పూల మొక్క అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నిర్దేశిత లక్ష్యాలను పూర్తిచేయాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ప్రజావాణి ద్వారా ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని చెప్పారు. వర్షాలు పడుతున్నందున వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖలు సమన్వయంతో అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్య చర్యలు, వ్యాధుల నివారణకు అన్ని ముందస్తు కార్యాచరణ ప్రణాళికననుసరించి చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో వ్యవసాయ శాఖ ద్వారా వానాకాలం సాగు పంటల విస్తీర్ణం, ఎరువులు, విత్తనాల సరఫరా గురించి జిల్లా వ్యవసాయాధికారి చెప్పారు. విత్తనాలు, ఎరువుల సరఫరా గురించి ప్రతిరోజు నివేదిక ఇవ్వాలని సూచించారు. విద్యా శాఖ ద్వారా పాఠశాలలు ప్రారంభం కాగానే ఒక జత యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు సరఫరా చేశామని, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో అత్యవసర మరమ్మతు, ఐదు రకాల అభివృద్ధి పనులు చేపట్టామని డీఈఓ వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖలు, విద్య, వైద్య, ఆరోగ్య, పౌర సరఫరాలు, జిల్లా గ్రామీణాభివృద్ధి, పరిశ్రమలు, మిషన్ భగీరథ, మున్సిపాలిటీలు, గనులు, భూగర్భ జల వనరులు తదితర శాఖల వారీగా సమీక్షించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు

జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ విజయేందిరను జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి మంగళవారం కలెక్టర్‌ను ఆమె చాంబర్‌లో పూల మొక్క అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. అనంతరం జెడ్పీ సీఈఓ రాఘవేంద్రరావు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కోయిల్‌సాగర్‌కు జూరాల నీటి విడుదల



కోయిల్‌సాగర్‌కు నీటి విడుదల చేసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

- ఆయకట్టు రైతుల ఆనందం

మరికల్: తీలేర్ పంపుహౌస్‌కు వచ్చిన జూరాల బ్యాక్ వాటర్‌ను మంగళవారం ఎమ్మెల్యే పర్ణికారెడ్డి పూజలు చేసి కోయిల్‌సాగర్‌కు నీటిన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో కురిసిన వర్షాల వల్ల జూరాలకు భారీగా వరదనీరు చేరిందన్నారు. అక్కడి నుంచి ఫర్దీపూర్ రిజర్వాయర్ నింపి కోయిల్‌సాగర్ ప్రాజెక్టును నింపేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రైతులు వానాకాలం సాగు చేసే పంటలకు నీటిన్ని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అంతకు ముందు తీలేర్ పంపుహౌస్‌లో ఎమ్మెల్యే మోటార్‌ను ప్రారంభించగానే పరవళ్లు తొక్కుతూ కోయిల్‌సాగర్ వైపు పరుగులు పెడుతున్న కృష్ణమ్మకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు.

కోయిల్‌సాగర్ నీటిమట్టం 10 అడుగులు

ప్రస్తుతం కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో 10 అడుగుల మేర నీటి నిల్వ ఉంది. ఎగువ కర్ణాటక రాష్ట్రంలో కురిసిన వర్షాల కారణంగా జూరాలకు భారీగా వరదనీరు చేరుకోవడంతో కోయిల్‌సాగర్‌ను పూర్తి స్థాయిలో నింపేందుకు వారం రోజుల క్రితం చిన్నచింతకుంట మండలం ఉంద్యాల పంపుహౌస్ దగర ఫర్దీపూర్ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేశారు. అక్కడి నుంచి సోమవారం రాత్రి తీలేర్ పంపుహౌస్‌కు నీరు చేరుకోవడంతో కోయిల్‌సాగర్ ప్రాజెక్టును పూర్తి స్థాయిల్లో నింపేందుకు తీలేర్ పంపుహౌస్ నుంచి జూరాల బ్యాక్ వాటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. మంగళవారం అర్ధరాత్రి వరకు కోయిల్‌సాగర్‌కు జూరాల నీరు చేరుకోవచ్చాని అధికారులు అంచనా వేస్తున్నారు. జూరాల నీరు కోయిల్‌సాగర్‌కు వదలడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, రేవత్తమ్మ, సూర్యమోహన్, వీరన్న, కృష్ణయ్య, హరీష్, రఘు, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణరెడ్డి, మోహన్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీను, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు స్వల్పంగా ఇన్‌ఫ్లో

ధరూరు/దోమలపెంట/రాజోళి/మదనాపురం: ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులకు స్వల్పంగా ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు మరింత తగ్గుముఖం పట్టింది. మంగళవారం 3,807 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ద్వారా 810 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 140, భీమా లిఫ్టు–1కు 650, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 844క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 966 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి 2,881 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.949 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

■ వనపర్తి జిల్లాలోని రామన్‌పాడు జలాశయంలో నీటి సామర్థ్యం పెరుగుతోంది. ప్రాజెక్టులో 1,019 అడుగుల మేర నీటిమట్టం ఉంది. జూరాల సమాంతర కాల్వద్వారా 800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది.తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగి స్తున్నామని ఏఈ సింగిరెడ్డి రవీల్‌రెడ్డి తెలిపారు.

■ శ్రీశైలం ప్రాజెక్టులో నీటిమట్టం 813.5 అడుగుల వద్ద 36.4002 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సుంకేసుల నుంచి 2,647 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,283 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోతల చేశారు. జలాశయంలో 76 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

■ సుంకేసుల జలాశయానికి ఎగువ 2,450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఒక గేటును తెరిచి 2,248 క్యూసెక్కులు దిగువకు వదిలినట్లు జేఈ రాజు తెలిపారు.

వరి క్వింటాల్ ధర రూ.3,069

- బాదేపల్లి యార్డులో రికార్డు స్థాయి ధర

జడ్చర్ల/ దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం వరి ధాన్యానికి రికార్డు స్థాయి ధర లభించింది. ఆర్‌ఎన్‌ఆర్ రకం క్వింటాలు గరిష్టంగా రూ.3,069, కనిష్టంగా రూ.1,950 చొప్పున పలికాయి. ఈ సీజన్‌లో వరి ధాన్యానికి రూ.3 వేలు దాటి ధర రావడం ఇదే మొదటిసారి. అలాగే హంస రకానికి గరిష్టంగా రూ.1,859, కనిష్టంగా రూ.1,839, మొక్కజొన్న గరిష్టంగా రూ.2,501, కనిష్టంగా రూ.2,069, జొన్నలు రూ.3,777, వేరుశనగ రూ.3,209, ఆముదాలు సరాసరిగా రూ.5,629 చొప్పున వచ్చాయి.

దేవరకద్ర మార్కెట్‌లో లావాదేవీలు

దేవరకద్ర మార్కెట్ యార్డులో మంగళవారం లావాదేవీలు కొనసాగాయి. వివిధ గ్రామాల నుంచి రైతులు మార్కెట్‌కు తెచ్చిన ధాన్యానికి టెండర్లు వేశారు. హంస ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.1,800, కనిష్టంగా రూ.1,700 చొప్పున ధరలు నమోదయ్యాయి.

21 నుంచి యోగా తరగతులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21 నుంచి పది రోజులపాటు స్థానిక బ్రాహ్మణవాడీలో యోగా క్లాసులు ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు తరగతులు ఉంటాయని పేర్కొన్నారు.

పుస్తకాల దందా



- విద్యార్థులకు బలవంతంగా స్టడీ బుక్స్ అంటగడుతున్న ప్రైవేట్ యాజమాన్యాలు
- సొంత కరికులంను అమలు చేస్తున్న కొన్ని విద్యాసంస్థలు
- ప్రభుత్వ పుస్తకాలను బేఖాతర్ చేస్తున్న పరిస్థితి
- ఐఐటీ, నీట్ పేరుతో రూ.వేలల్లో డబ్బుల వసూలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు ధనార్జనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. అధిక ఫీజులు ఒక ఎత్తు అయితే.. పుస్తకాలు, యూనిఫాంలు, ఇతరత్రా వాటి పేరుతో వసూలు మరో ఎత్తు అవుతోంది. ఫీజులు ఎలా ఉన్నప్పటికీ విద్యార్థులకు అసలు ప్రభుత్వం అమలు చేస్తున్న కరికులం బోధిస్తున్నారా.. అంటే అదీనూ లేదు. విద్యార్థులకు మెరుగైన విద్య పేరుతో ప్రైవేట్ విద్యాసంస్థలు సొంత కరికులం వినియోగిస్తున్నారు. వీటితో పాటు దాదాపు అన్ని ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో 6, 7వ తరగతి నుంచే విద్యార్థులకు ఐఐటీ, నీట్ కోర్సులను ప్రవేశ పెడుతున్నారు. వీటి పేరుతో కూడా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా 1,260 ప్రైవేటు పాఠశాలలు ఉండగా.. వీటిలో 1.10 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు.

విద్యార్థి మానసిక పరిస్థితిపై ప్రభావం

ప్రైవేట్ విద్యాసంస్థలు ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు పూర్తిగా ప్రభుత్వం విడుదల చేసిన సిలబస్, పుస్తకాలు, కరికులాన్ని వినియోగించాలి. కానీ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉమ్మడి జిల్లాలో కొందరు కార్పొరేట్ పాఠశాలల పేరుతో విద్యాసంస్థలను నిర్వహిస్తూ వారి సొంత కరికులంను అమలు చేస్తున్నారు. ప్రైవేట్ యాజమాన్యాల తీరుతో విద్యార్థుల చదువులు ప్రశ్నార్థకంగా మారాయి. ఏ తరగతిలో అయినా సిలబస్ తయారీలో ఎస్సీఆర్టీఈ, తెలంగాణ విద్యా మండలి వంటి సంస్థలు ఎంతో నిష్ణాతులైన వారితో పుస్తకాలు రూపొందిస్తారు. కానీ, ప్రైవేట్ పాఠశాలలు అమలు చేస్తున్న సొంత కరికులం ఎవరు తయారు చేశారు.. ఏ ప్రతిపాదికన వినియోగిస్తున్నారు.. అనేది ప్రశ్నగా మారింది. విద్యార్థి వయసుకు మించి కరికులం అమలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీంతో విద్యార్థి మానసిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది.



ఓ పాఠశాలలో వినియోగిస్తున్న సొంత కరికులం పాఠ్య పుస్తకాలు

నర్సరీ నుంచే మొదలు..

నర్సరీ, యూకేజీ, ఎల్‌కేజీ పుస్తకాలకు సైతం రూ.వేలల్లో ఫీజులు దండుకుంటున్న పరిస్థితి నెలకొంది. కొందరు పుస్తకాలను నేరుగా పాఠశాలల్లో అమ్మకుండా, బుక్‌సెంటర్లు, లేదా ఒక షాప్‌లలో డంప్ చేసి విద్యార్థులకు విక్రయిస్తున్నారు. అన్ని తెలిసిన విద్యాశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం నర్సరీ, యూకేజీ, ఎల్‌కేజీకి వారికి ఎలాంటి సిలబస్ లేదు. కానీ, ప్రైవేటు యాజమాన్యాలు పుస్తకాల కోసం రూ.2 వేల వరకు డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇక ప్రభుత్వ అమలు చేసే సిలబస్‌లో ప్రాథమిక పాఠశాల విద్యార్థి పుస్తకాల ధర రూ.70– 150 లోపు ఉంటుంది. మొత్తం 5 పుస్తకాల ఖర్చు రూ.500 లోపే. కానీ, ఒకటో తరగతి విద్యార్థి పుస్తకాలు, నోట్ బుక్స్ ధర రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు.

ఐఐటీ, నీట్ కోర్సులు..


6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల వయస్సు, మానసిక పరిస్థితుల ఆధారంగా ప్రత్యేక పుస్తకాలు, సిలబస్‌ను ప్రభుత్వం అందుబాటులో ఉంచి, వారు సూచించిన పుస్తకాలను మాత్రమే వినియోగించాలని పేర్కొంది. కానీ, ప్రైవేట్ పాఠశాలలు ఐఐటీ, నీట్ కోర్సుల పేరుతో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు బోధిస్తున్నారు. పాఠశాలల్లో చేరే క్రమంలో అడ్మిషన్ల సమయంలో సాధారణ, ఐఐటీ, నీట్ అడ్మిషన్లు తీసుకుంటూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. విద్యార్థి ఉదయం 8 గంటలకు పాఠశాలకు వెళ్తే సాయంత్రం 6 గంటల వరకు తరగతులు నిర్విరామంగా కొనసాగిస్తున్నాయి. దీంతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు



ప్రైవేట్ పాఠశాలల్లో ఎలాంటి పుస్తకాలను విక్రయించవద్దు. అలాగే ప్రభుత్వం సూచించిన సిలబస్ పుస్తకాలను మాత్రమే వినియోగించాలి. సొంత కరిక్యూలమ్ అమలు చేయడం కూడా సరికాదు. ఐఐటీ, నీట్ వంటి కోర్సుల పేరుతో విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు. సమస్యలపై తల్లిదండ్రుల ఫిర్యాదు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్



మహబూబ్‌నగర్‌లోని ఓ పాఠశాలలో ఎల్‌కేజీకి పాఠ్యపుస్తకాలకు రూ.1,675, 2వ తరగతికి రూ.2,740 వసూలు చేసిన రశీదు

క్లుప్తంగా

చేపలవేటకు వెళ్లి వ్యక్తిమృతి

గోపాల్‌పేట: చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. గోపాల్‌పేట ఏఎస్‌ఐ చంద్రశేఖర్‌గౌడ్ కథనం ప్రకారం.. ఏదుల గ్రామానికి చెందిన బోయిని కుర్మయ్య (41) తన భార్య కృష్ణమ్మ, కుమారుడితో కలిసి హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుని జీవనం గడుపుతున్నారు. కాగా తమ చిన్నకుమార్తెను ఇచ్చిన ఏదుట్లలో మంగళవారం ఎల్లమ్మ పండుగ ఉండడంతో.. సోమవారం హైదరాబాద్ నుంచి వచ్చారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం చేపలు పట్టేందుకు ఏదుట్ల శివారులో ఉన్న బావి తగ్గరికి తన కుమారుడు, అల్లుడితో కలిసి కుర్మయ్య వల తీసుకుని వెళ్లాడు. ప్రమాదవశాత్తు వల కుర్మయ్య కాలుకు తట్టుకోవడంతో నీటిలో మునిగిపోయి మృతిచెందాడు. కుర్మయ్య భార్య కృష్ణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశామని ఏఎస్‌ఐ వివరించారు.

రైలు కిందపడి వృద్ధుడు ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: రైలు కిందపడి గుర్తుతెలియని వృద్ధుడు (60) ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ వివరాల మేరకు.. స్థానిక వెంకటేశ్వర కాలనీ అపార్ట్‌మెంట్స్ సమీపంలో రైలు పట్టాలపై వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని.. షర్టు కాలర్‌పై శివ టైలర్స్, మహబూబ్‌నగర్ అని మాత్రమే ఉందని ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్..


మల్లేష్ (ఫైల్)

బిజినేపల్లి: ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బిజినేపల్లి మండలం పోలెపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పోలెపల్లికి చెందిన సాకలి మల్లేష్ (30) హైదరాబాద్‌లో ఆటో నడుపుకొని జీవనం సాగించేవాడు. కొన్ని రోజులుగా సరైన ఆదాయం లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఆదివారం స్వగ్రామానికి వచ్చిన అతడు.. మధ్యరాత్రి సమయంలో ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెల్లవారుజామున లేచి చూసేసరికి మల్లేష్ ఉరేసుకుని కన్పించడంతో ఒక్కసారిగా రోదనలు మిన్నంటాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బిజినేపల్లి: మండలంలోని మంగనూర్‌కు చెందిన ఆంజనేయులుగౌడ్ (32) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఏఎస్‌ఐ సయ్యద్ అలీ తెలిపారు. ఈనెల 11న గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన నడుచుకుంటూ వెళ్తున్న అతడిని తాండూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక డంపు సీజ్

అమరచింత: పట్టణ శివారులోని కృష్ణానాయక్ అనే వ్యక్తి తోటలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను సీజ్ చేసినట్లు ఆర్‌ఐ గోపాల్ తెలిపారు. తహసీల్దార్ చాంద్‌పాషా ఆదేశాల మేరకు ఇసుక డంప్ వద్దకు వెళ్లి విచారించినట్లు పేర్కొన్నారు. మొత్తం 40 నుంచి 50 ట్రాక్టర్ల ఇసుక ఉన్నట్లు గుర్తించామన్నారు. విషయాన్ని మైనింగ్ అధికారులకు తెలియజేసి, ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

శ్మశాన వాటికలో మహిళ శవం పుర్రెల వెలికితీత

- నెల రోజుల క్రితం పూడ్చినట్లుగా నిర్ధారణ



ధరూరు: మండల కేంద్రంలోని బీసీ శ్మశాన వాటిక సమీపంలో కనిపించిన గుంతలో మహిళ శవం పుర్రె వెలికి తీశారు. ఇటీవల గ్రామ రైతులకు పుర్రెలు కనిపించడంతో రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించిన విషయం తెలిసిందే. దీంతో మంగళవారం తహసీల్దార్ వెంకట్రావ్, ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గుంత తవ్వగా 45–50 ఏళ్ల మధ్య ఉన్న మహిళ శవం లభ్యమైంది. పుర్రెలతోపాటు చీర బయటపడటంతో గద్వాల ఏరియా ఆస్పత్రి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. దీంతోపాటు డీఎన్‌ఏ టెస్టుకు సైతం నమూనాలను సేకరించి పంపించారు. గతంలో సమీపంలోని శ్మశాన వాటికలో కొందరు శవాలను పూడ్చారు. అక్కడ గుంత వెలికితీతలో లభ్యమైన పుర్రెలు పాతవా..? లేక ఎవరైనా ఇక్కడ తెచ్చి పూడ్చిపెట్టారా అనేది తేలాల్సి ఉంది.


రాహుల్ (ఫైల్)

తను కనుమరుగై.. నలుగురికి ప్రాణదీపమై..

- రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు
- కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్‌తో మృతి
- అవయవాలు దానం చేసిన తల్లిదండ్రులు
- పెళ్లైన 50 రోజులకే తిరిగిరాని లోకాలకు..
- నారాయణపేట జిల్లా కోటకొండలో విషాదం


మృతదేహంపై పూలు చల్లి నివాళులర్పిస్తూ..

నారాయణపేట రూరల్: చేతికి అందివచ్చి ప్రయోజకుడైన కుమారుడిని చూసిన తల్లిదండ్రులు.. ఇటీవలే వివాహం చేసుకుని అతని జీవితంలోకి అడుగు పెట్టిన నవవధువు.. ఇరు కుటుంబాల్లో నిండిన ఆనంద క్షణాలు ఎంతోకాలం నిలవలేదు.. అడవిపంది రూపంలో దూసుకొచ్చిన మృత్యువు ఆ యువకుడిని కబళించి కుటుంబాన్ని విషాదంలోకి నెట్టినా.. అవయవాలను దానం చేసి మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు. యువకుడి మృతి ఘటన ఎంతోమందిని కలచివేస్తున్నా.. అవయవ దానం చేసి నలుగురికి జీవితాన్ని ఇవ్వడంతో ప్రతిఒక్కరు హ్యాట్సాఫ్ చెబుతున్నారు.

ఉద్యోగానికి వెళ్తుండగా ప్రమాదం..

నారాయణపేట మండలంలోని కోటకొండలో బసుదే నారాయణరావు, సునందబాయి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది. పెద్ద కుమారుడు బసుదే రాహుల్(25) హైదరాబాద్‌లో ఎంటెక్ పూర్తి చేసి ఇటీవల జడ్చర్లలోని పోలేపల్లి సెజ్‌లో ఓ ప్రైవేట్ మెడిసిన్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఏప్రిల్ 21న హైదరాబాద్‌కు చెందిన ప్రియాంకతో వివాహం జరిగింది. అయితే ఈ నెల 11న విధులకు హాజరయ్యేందుకు స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం వింజమూర్ సమీపంలో అటవీ ప్రాంతంలో ఓ మలుపు దగ్గర అకస్మాత్తుగా అడవిపంది ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాహుల్‌ను అటుగా వెళ్తున్న వాహనదారులు 108లో మహబూబ్‌నగర్ అటు నుంచి హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రికి తరలించారు.

అవయవ దానం చేసి..

తీవ్రగాయాలతో కేర్ ఆస్పత్రిలో చేరిన రాహుల్ మృత్యువుతో పోరాడుతూ బ్రెయిన్‌డెడ్‌తో మంగళవారం తనువు చాలించాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో బోరున విలపించారు. అయితే పుట్టెడు దుఃఖంలోనూ రాహుల్ శరీరంలోని అవయవాలను దానం చేయడానికి కుటుంబీకులు ముందుకు వచ్చారు. వెంటనే కేర్ ఆస్పత్రి వర్గాలు అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. వెంటనే అన్ని అవయవాలను పరిశీలించి రెండు కిడ్నీలు, గుండె, లివర్, లంగ్స్‌లను ఆయన శరీరంలో నుంచి తీసుకున్నారు. చనిపోతూ కూడా అవయవ దానం చేసి నలుగురికి ప్రాణాలు నిలబెట్టిన రాహుల్ పార్థివదేహానికి ఎంతో గౌరవంగా ఆస్పత్రి సిబ్బంది డిశ్చార్జ్ చేశారు. పెద్దఎత్తున పూలు చల్లుతూ ప్రత్యేక అంబులెన్స్‌లో స్వగ్రామానికి తరలించారు.

కోటకొండలో విషాదఛాయలు

రాహుల్ మృతితో స్వగ్రామం కోటకొండలో విషాదఛాయలు అలుముకున్నాయి. అవయవ దానం విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాలైన తిర్మలాపూర్, బండగొండ, అభంగాపూర్ వాసులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రద్ధాంజలి ఘటించారు. స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి, బీజేపీ నాయకులు నాగురావు నామాజీ, ఎస్ఎస్‌కే సమాజ్ అధ్యక్షుడు చందులాల్ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

'పాలమూరు'కు జాతీయ హోదా తేవాలి


విద్యార్థులకు పంపిణీ చేసే బూట్లను చూపిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్రం నుంచి జాతీయ హోదా తీసుకొచ్చేందుకు ఎంపీ డీకే అరుణ ప్రత్యేక చొరవ తీసుకోవాలని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టుకు ప్రత్యేక హోదా తీసుకొస్తామని ఎన్నికల సమయంలో బీజేపీ చెప్పడంతో ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులంతా బీజేపీకే ఓట్లు వేశారని గుర్తుచేశారు. తాము నిర్వాసితులకు న్యాయబద్ధంగా పరిహారం ఇస్తామని చెప్పినా ఓట్లు వేయకపోవడంతో తమ అభ్యర్థికి తక్కువ ఓట్లు వచ్చాయని అన్నారు. నియోజకవర్గంలో 20 వేల మెజార్టీ వస్తుందనుకున్నానని, రాలేదని, ప్రజాతీర్పును గౌరవిస్తామన్నారు. త్వరలోనే నియోజకవర్గంలోని పలు బీటీ రోడ్ల విస్తరణ పనులకు ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేస్తామన్నారు. మరో 110 కిలోమీటర్ల మేరకు పంచాయతీరాజ్ రోడ్లను ఆర్అండ్‌బీకి మార్చి అభివృద్ధి చేస్తామన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న దాదాపు 53,000 మంది విద్యార్థులకు తన సొంత ఖర్చులతో బూట్లను పంపిణీ చేస్తామని అన్నార

కాలుష్యంపై అసెంబ్లీలో మాట్లాడుతా..

రంగారెడ్డిగూడ సమీపంలోని స్పాంజ్ ఐరన్ పరిశ్రమ నుంచి విచ్చలవిడిగా పొల్యూషన్ ఏర్పడుతుందని, దీనిపై తాము నిరంతరంగా పోరాడుతున్నామన్నారు. అయితే సంబంధిత పొల్యూషన్ బోర్డు అధికారులు ఇచ్చిన తప్పుడు రిపోర్టుల ఫలితంగా ఎంపీ ఎన్నికల్లో తమకు తమ ఊరి పోలింగ్ బూత్‌లో మెజార్టీ తగ్గిందన్నారు. సమావేశంలో ఎంఈఓ మంజులాదేవి, మాజీ ఎంపీపీలు నిత్యానందం, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

నిషేధిత గుట్కా పాకెట్ల పట్టివేత

- పట్టుబడిన వాటి మొత్తం విలువ రూ.6.67 లక్షలు



నారాయణపేట: జిల్లా కేంద్రంలో నారాయణపేట పోలీసులు, టాస్క్ ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా పలు కిరాణా షాపులలో మంగళవారం దాడులు నిర్వహించారు. రూ.6,67,075 విలువ చేసే నిషేధిత అంబర్, జర్ద, గుట్కా పాకెట్లను, పాన్ మసాలా, పొగాకు జర్దా కలిపి అమ్ముతున్నందున స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఈమేరకు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. అశోక్ పసారి కిరాణం, గోదాంలో రూ. 6,44,865, కే. వెంకట్ రాములు కిరాణంలో రూ. 13,090, నజీర్ అహ్మద్ కిరాణంలో రూ. 9,120 విలువ చేసే గుట్కాలు, విమల్, టొబాకో స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు పంచనామా చేసి సీఐ శివ శంకర్ ఆదేశాల మేరకు ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కలప లారీ పట్టివేత



మహమ్మదాబాద్: అక్రమంగా కలపను తరలిస్తున్న ఓ లారీని పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని మంగంపేట్, మొకర్లాబాద్ గ్రామాల మధ్య కొందరు వ్యాపారులు చెట్లను నరికి.. కలపను అక్రమం లారీల ద్వారా తరలిస్తున్నారు. ఈ క్రమంలో అటుగా వెళ్తున్న పోలీసులు గమనించి లారీని పట్టుకుని అనుమతి లేకపోవడంతో స్టేషన్‌కు తరలించారు. కాగా కొందరు వ్యాపారులు అధికారులను కనుసన్నల్లో పెట్టుకుని ఈ వ్యవహారం సాగిస్తున్నారని తెలియవస్తోంది. దీంతో గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో ఎలాంటి చెట్లు లేకుండా పోయి వర్షాలు కురవని పరిస్థితి నెలకొన్నదంటూ ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రాత్రివేళల్లో అడవుల్లోకి వెళ్లి ట్రాక్టర్లలో కలపను తీసుకుని వెళ్లి ఇటుకబట్టీల్లో వినియోగిస్తున్నారని తెలుస్తోంది.

సరదా కోసం వచ్చి తీరని లోకాలకు..

- ఆత్మకూర్ మండలంలో వాహనం బోల్తాపడి యువకుడి దుర్మరణం
- జూరాల ప్రాజెక్టు సందర్శనకు వచ్చి వెళ్తుండగా సంఘటన



ప్రమాదస్థలంలో బోల్తా పడిన వాహనం

ఆత్మకూర్: సరదా కోసం వచ్చిన స్నేహితులు తిరుగు ప్రయాణంలో వాహనం బోల్తా పడటంతో ఒకరు మృతిచెందగా.. ఆరుగురికి గాయాలయ్యాయి. వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండలంలో సంఘటన చోటు చేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పాన్‌గల్ మండల కేంద్రానికి చెందిన రోషన్(23) శేఖర్, శ్రీకాంత్, సాయి, వంశీ, శరత్, మోహన్ స్కార్పియో 21 ఎస్ 6472 వాహనంలో మధ్యాహ్నం జూరాల ప్రాజెక్టు సందర్శనకు వెళ్లారు. సరదాగా గడిపిన స్నేహితులు ఏడుగురు సాయంత్రం తిరుగు పయనమయ్యారు. జూరాల ప్రధాన ఎడుమ కాల్వ మీదుగా మూలమల్ల గ్రామ శివారులో వస్తుండగా.. టైర్ పేలిపోయి వాహనం బోల్తా పడింది. ఈ సంఘటనలో రోషన్ అక్కడికక్కడే మృతిచెందగా.. మిగితా ఆరుగురు గాయాలపాలయ్యారు. విషయాన్ని గమనించిన పరిసరాల రైతులు 108 వాహనానికి సమాచారం అందించి ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రోషన్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా క్షతగాత్రులకు చికిత్సలు నిర్వహిస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సోయాబీన్.. యాజమాన్య పద్ధతులు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియానాయక్, ఏడీఏ, అలంపూర్


సోయా పంట సాగు(ఫైల్)

అలంపూర్: ఖరీఫ్ పంట కాలం ఆరంభమైనందున అన్నదాతలు సాగుకు సిద్ధమవుతున్నారు. నల్లరేగడి నేలల్లో పత్తి సాగుకు ప్రత్యామ్నాయంగా సోయాబీన్ పంటను సాగు చేసుకోవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియానాయక్ రైతులకు సూచించారు. 100 నుంచి 110 రోజులు పంట కాలం ఉండే సోయాబీన్‌ను పత్తి, కందిలో సహయ పంటగా, పండ్ల తోటలో అంతర్ పంట గానూ సాగు చేసుకోవచ్చని వివరించారు. సోయా పంట ముగిసిన తర్వాత రబీలో శనగ, మినుములను సాగు చేసుకోవచ్చని అధికారులు సూచించారు.

నేలలు: మురుగు నీరు పోయే వసతి ఉండి, తేమను నిలుపుకోగల భూములు అనువైనవి.

రకాలు: జేఎస్–335, ఎల్ఎస్‌బీ–1, పీకే–472 అందుబాటులో ఉన్నాయని, వీటిలో జేఎస్–335 రకం పంట దిగుబడి అధికంగా వస్తుందని వ్యవసాయ అధికారులు తెలిపారు.

విత్తనం: ఎకరానికి 25 నుంచి 30 కిలోలు విత్తనం అవసరం. విత్తనాన్ని 45•5 సెంటీమీటర్ల దూరంలో.. వరుసలోని మొక్కల మధ్య 3 సెంటీమీటర్ల లోతులో మొత్తటి దుక్కిలో నాటు వేసుకోవాలి.

విత్తే కాలం: జూన్ రెండో వారం నుంచి జులై మొదటి వారం వరకు విత్తడానికి వాతావరణం అనుకూలంగా ఉంటుంది

కలుపు నివారణ: సోయాలో మొదటి 45 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకోవాలి. విత్తిన 20 రోజులకు ఎకరానికి 250 మి.లీ ఇమాజిత్ పైర్ అనే కలుపు మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవచ్చు.

ఎరువులు: ఎకరానికి 25 కిలోల యూరియా, 150 కేజీల సూపర్, 25 కిలోల పొటాష్ అవసరం. విత్తేటప్పుడు ఫోరేట్ 10 జీ గుళికలు ఎకరానికి 4 కిలోలు చొప్పున వాడితే కాండపు ఈగలాంటి పురుగును నివారించుకోవచ్చు.

పంట కోత: ఆకులు పసుపువు పచ్చ రంగులోకి మారి, రాలిపోవడం మొదలైనప్పుడు లేదా కాయలు ఆకుపచ్చ నుంచి బూడిద రంగులోకి మారినప్పుడు కోయాలి. కోత ఆలస్యం అయితే కాయలు చిట్లి గింజలు రాలిపోయతాయి. పంట కోసిన తర్వాత 2 నుంచి 3 రోజులు ఆరబెట్టి గింజలోని తేమ శాతం 14 వరకు చూసి నూర్పిడి చేయాలి.

దిగుబడి: సోయా సాగుకు ఎకరానికి రూ.8 వేల వరకు ఖర్చు అవుతుంది. మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి పొందవచ్చు.

త్వరలోనే పునరావాసం ఏర్పాట్లు


రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావ్‌ను కలిసి వినతి అందజేస్తున్న పునరావాస గ్రామ కమిటీ సభ్యులు

మన్ననూర్: త్వరలోనే పునరావాస స్టేట్ కమిటీని ఏర్పాటు చేసి, పునరావాసం కోసం పనులు త్వరితగతిన చేపట్టేందుకు తన వంతుగా పూర్తిస్థాయిలో కృషి చేస్తానని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావ్ హామీ ఇచ్చారు. ప్యాకేజీ, పునరావాసం విషయంలో ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, అందరికి అన్ని విధాలుగా సమన్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని సార్లపల్లికి చెందిన పునరావాస గ్రామ కమిటీ సభ్యులు తెలియజేశారు. పునరావాసంలో భాగంగా స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న వారికి ప్రభుత్వం ఇచ్చే ప్యాకేజీ త్వరితగతిన వర్తింపజేసి ఆచరణలో అమలు చేయాలని కోరుతూ.. మంత్రి జూపల్లి కృష్ణారావ్‌కు మంగళవారం వినతి అందజేశామని కమిటీ అధ్యక్షుడు పుణ్యమూర్తి విష్ణు తెలియజేశారు. అమ్రాబాద్ మండలం పులుల రక్షిత అభయారణ్యంలోని సార్లపల్లికి చెందిన పునరావాస గ్రామ కమిటీ సభ్యులు హైదరాబాద్‌లోని మంత్రి చాంబర్‌లో మంత్రిని కలిసినట్లు వివరించారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి పలు విషయాలను కమిటీ సభ్యులతో మంత్రి చర్చించారని తెలియజేశారు. రెండేళ్లుగా గ్రామం నుంచి కొంత మంది చెంచులు మినహాయిస్తే గ్రామంలోని అన్ని వర్గాలకు చెందిన కుటుంబాల వారు స్వచ్ఛందంగా పునరావాసం కోరుకుంటున్నారని మంత్రికి తెలియజేశామన్నారు. ఈ క్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది అటవీ శాఖ నిబంధనలు పూర్తి స్థాయిలో అమలు చేస్తుండటంతో ప్రస్తుతం గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు చోటుచేసుకోవడంలేదన్నారు. పిల్లల చదువులకు ఆటంకాలు, జీవనోపాధులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. మంత్రిని కలిసిన వారిలో పునరావాస గ్రామ కమిటీ సభ్యులు సంతోష్, వెంకటేశ్వర్లు, రమేష్, నారాయణ తదితరులు ఉన్నారు.

విద్యుత్ టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

- మద్యం మత్తులోని వ్యక్తిని కాపాడిన యువకుడు


విద్యుత్ టవర్‌పై కూర్చున వ్యక్తిని కాపాడేందుకు వెళ్తున్న యువకుడు


శ్రీకాంత్‌ను అభినందిస్తున్న సీఐ, ఎస్‌ఐ

మరికల్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి, మరికల్‌లో విద్యుత్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. అందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జిన్నారానికి చెందిన కృష్ణ మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మరికల్‌లో మద్యం తాగి పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న ఓ భారీ విద్యుత్ టవర్‌ను ఎక్కుతుండగా.. అక్కడే ఉన్న ఓ యువకుడు గమనించి వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. విద్యుత్ అధికారులు వెంటనే కరెంట్ సరఫరాను నిలిపివేశారు. సదరు వ్యక్తి టవర్‌పై కూర్చోవడమే కాకుండా విద్యుత్ తీగలను బలంగా తాకాడు. ఇది గమనించిన పెద్దచింతకుంటకు చెందిన శ్రీకాంత్ వెంటనే టవర్ పైకి ఎక్కి సదరు వ్యక్తిని జాగ్రత్తగా కిందకు తీసుకొచ్చాడు. కిందకు వచ్చిన వెంటనే ఆ వ్యక్తిని సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్‌ఐ మురళి అదుపులోకి తీసుకున్నారు. వివరాలు తెలుసుకొని జిన్నారం గ్రామస్తులకు అప్పగించారు. అనంతరం విద్యుత్ టవర్ పైకి ఎక్కి మద్యం మత్తులోని వ్యక్తి ప్రాణాలు కాపాడిన శ్రీకాంత్‌ను సీఐ, ఎస్‌ఐ అభినందించారు.

నాటుసారా తయారీ కేంద్రాల ధ్వంసం


వెల్దండ మండలంలో నాటుసారా, బెల్లం పానకం పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

వెల్దండ: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో మంగళవారం ఎక్సైజ్ అధికారులు విస్తతంగా దాడులు నిర్వహించారు. ఈ మేరకు 1,300 లీటర్ల బెల్లం పానకం పారబోశారు, 34 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా తయారీకేంద్రాలను ధ్వంసం చేశారు. కల్వకుర్తి ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో స్టేట్‌టాస్క్‌ఫోర్స్ హైదరాబాద్ టీం, మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం, డిస్టిక్‌టాస్క్‌ఫోర్స్ నాగర్‌కర్నూల్ టీం, తెల్కపల్లి, అచ్చంపేట ఎక్సైజ్ స్టేషన్స్ టీం, కల్వకుర్తి, వెల్దండ ఎక్సైజ్ శాఖ వారు సంయుక్తంగా ఈ దాడులు నిర్వహించారు. వెల్దండ మండలంలోని మైసమ్మ పల్లుగతండా, చిన్నతండా, మర్రిగుంతతండా, గాజులోనిబావితండా, నెమిలిగుండుతండా, పెరుమాలకుంటతండాలల్లో దాడులు కొనసాగాయి. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. 8 మందిపై కేసులునమోదు చేసినట్లు తెలిపారు. కాగా ఆరు మందిని అరెస్ట్ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐలు వెంకట్‌రెడ్డి, శారద, భిక్షారెడ్డి, రమణయ్య, ఎస్‌ఐలు వివేక్, సతీష్, బాలరాజు, చిన్నరాములు, వెల్దండ సివిల్ ఎస్‌ఐ రవి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు పెంకుటిల్లు దగ్ధం


పర్వతాపురంలో మంటల్లో కాలిపోయిన పెంకుటిల్లు, సామగ్రి

ఖిల్లాఘనపురం: ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని ఓ పెంకుటిల్లు దగ్ధమైన సంఘటన ఖిల్లాఘనపురం మండలం పర్వతాపురంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పర్వతాపురానికి చెందిన గొల్లబైకని అలివేల మంగళవారం ఇంటి తలుపు మూసి చుట్టు పక్కల వారి ఇంటికి వెళ్లింది. కొంత సమయానికి ఇంటికి మంటలు అంటుకున్నాయని గ్రామస్తులు చెప్పడంతో ఇంటికి వెళ్లి చూసింది. మంటలు పెద్దఎత్తున ఎగిసిపడుతుండటంతో బోరున విలపించింది. చుట్టుపక్కల వారు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని మంటలు ఆర్పారు. కాని అప్పటికే ఇంట్లోని నిత్యావసర సరుకులు, దుస్తులు, తిండిగింజలు, బీరువా తదితర సామగ్రి మొత్తం మంటల్లో కాలిపోయాయి. ఇంట్లో విద్యుత్ తీగలతో మంటలు చెలరేగి ఉంటాయని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు.

పాముకాటుతో రైతు మృతి


సాలే చంద్రప్ప (ఫైల్)

దామరగిద్ద: పాముకాటుకు గురై రైతు మృతి చెందిన ఘటన మంగళవారం నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలంలోని కానుకుర్తిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సాలే చంద్రప్ప (46) పొలంలో గొర్రెలకు మేత వేస్తుండగా విషపురుగు కాటేసినట్లు గమనించి ఇంటికి వచ్చారు. ఇంట్లో మంచినీరు తాగిన తర్వాత మాటలు పడిపోయాయి. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే జీపులో జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించి కుటుంబసభ్యులకు తెలిపారు. చంద్రప్పకు భార్య వెంకటమ్మతో పాటు కుమార్తె శృతి, కుమారుడు మోహన్ ఉన్నారు. కాగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు..

నవాబుపేట: బావిలో పడి మహిళ మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని కేశవరావుపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన లావణ్య(35) మంగళవారం తన పొలంలోని వ్యవసాయ బావిలోకి దిగుతుండగా.. ఆమెకు మూర్ఛ వచ్చి అక్కడికక్కడే నీటిలో పడిపోయింది. నీటిలో మునిగి మృతిచెందింది. ఆలస్యంగా తెలుసుకున్న కుటుంబ సభ్యులు బావిలో పరిశీలించగా.. అప్పటికే మృతిచెందింది. కాగా మృతురాలికి భర్తతో పాటు కుమారుడు ఉన్నాడు. ఈ విషయంలో ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు వివరించారు.

చికిత్స పొందుతూ బాలుడు..

వారం రోజుల కిందట మండల పరిధిలోని కేశవరావుపల్లికి చెందిన రాజేష్‌కుమార్(6) వారి బంధువు నడుపుతున్న బైక్ వెనకాల కుర్చున్నాడు. బైక్ పైనుంచి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ మంగళవారం ఆస్పత్రిలో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.